క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



కు.ని ఆపరేషన్లు చేయించుకున్న వారికి సూచనలిస్తున్న వైద్యులు

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని కొనకనమిట్ల, గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు సురేఖ, విజయకుమార్‌రెడ్డి, ఎస్పీ బాలయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 13 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, వారికి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆపరేషన్లు చేయించుకున్న మహిళలకు ప్రభుత్వం అందించే పారితోషకం త్వరలోనే బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని డాక్టర్ సురేఖ తెలిపారు.

గాయత్రి మాత ఆలయంలో అన్నదానం

గిద్దలూరు రూరల్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కాశినాయన కుంటలో గల గాయత్రి మాత ఆలయం ఆవరణలో దాతల సహకారంతో బుధవారం అన్న సంతర్పణ చేశారు. సమాజంలోని మరికొందరు దాతలు గొప్ప మనసుతో అన్న సంతర్పణకు ముందుకు రావాలని యోగా టీచర్ కోరారు.

సాగులో డ్రోన్లు ఉపయోగించుకోండి

మార్కాపురం: రైతులు కూలీల ఖర్చు తగ్గించుకునేందుకు డ్రోన్లు ఉపయోగించుకోవాలని ఏడీఏ బాలాజీ నాయక్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో రామభూమి రైతుల గ్రూపునకు మంజూరైన డ్రోన్‌ను బుధవారం అందజేశారు. ఒక డ్రోన్‌తో రోజుకు 25 నుంచి 35 ఎకరాలకు పురుగుమందులను పిచికారీ చేసుకోవచ్చని ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ బుజ్జీబాయి, హెచ్ఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వ్యాపారాలు కొనసాగించాలి



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారాలు కొనసాగించాలని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రేషన్ షాపులు, గ్యాస్ గోడౌన్లు, రైస్ మిల్లులు, వాటర్‌ప్లాంట్లను అధికార యంత్రాంగంతో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామనారాయణరెడ్డి, ఆర్ఐ భాస్కర్‌రావు, అగ్నిమాపక సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సలహాలు నిల్లు.. తనిఖీలకు చెల్లు!

గిద్దలూరు నియోజకవర్గంలో జాడ లేని ఆహార సలహా సంఘాలు



రేషన్ దుకాణం

- రేషన్ నరుకుల పంపిణీపై పర్యవేక్షణ కరువు
- లబ్ధిదారుల సమస్యలు పట్టించుకోని అధికారులు

బేస్తవారిపేట:

ఆహార సలహా సంఘాల ఏర్పాటుపై పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలను అరికట్టడంతోపాటు కార్డుదారులకు సజావుగా సరుకులు పంపిణీ చేసేందుకు ఉపయోగకరంగా ఉండేందుకు దోహదపడే ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి ఆహార సలహా సంఘం ఆధ్వర్యంలో రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీపై సమీక్షించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వంలో ఆహార సలహా సంఘాల జాడే కానరావడం లేదు.

గిద్దలూరు నియోజకవర్గంలో దాదాపుగా 205 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 83,609 మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలను నిరోధించేందుకు ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సంఘ చైర్మన్‌గా ఆర్డీఓ/సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యుడు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు ఉంటారు. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీ, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు–కొలతలపై పర్యవేక్షణ అధికారాలు ఉంటాయి. అయితే ఇటీవల సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలను నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో రేషన్ డీలర్లదే ఇష్టారాజ్యమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చౌక ధరల దుకాణాల్లో ఇచ్చే సరుకుల నాణ్యతను పట్టించుకునే వారే కరువయ్యారు. రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో తలెత్తుతున్న సమస్యలపై లబ్ధిదారులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. షాపుల్లో సకాలంలో సరుకులు పంపిణీ చేయడం లేదని, నాణ్యత కూడా అంతంత మాత్రమేనని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

ఎండీయూల రద్దుతో కమిటీల అవసరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేసి రేషన్ కార్డుదారులకు ఇంటివద్దకే సరుకులు పంపిణీ చేసేది. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో మళ్లీ ఆహార సలహా కమిటీల ఆవశ్యకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు ఆహార సలహా కమిటీలను ఏర్పాటు చేసి నిత్యావసర సరుకుల పంపిణీని పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

నియోజకవర్గంలో రేషన్‌కార్డులు, షాపుల వివరాలు

మండలం	రేషన్ షాపులు	కార్డుదారులు
అర్ధవీడు	29	10,506
బేస్తవారిపేట	39	14,939
కంభం	31	12,838
గిద్దలూరు	53	23,472
రాచర్ల	27	10,188
కొమరోలు	26	11,666

పర్యవేక్షణ లేదు



ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించడం ద్వారా అవినీతిని అరికట్టవచ్చు. రేషన్ సరుల పంపిణీపై కొంత వరకు పర్యవేక్షణ ఉంటుంది. రేషన్ దుకాణాల్లో లోటుపాట్లు, అవినీతిపై సమావేశంలో సభ్యులంతా చర్చించి అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు వీలు కలుగుతుంది. ఆహార సలహా సంఘాలను ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలి.

– ఆవుల శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, బేస్తవారిపేట

నూతన కమిటీ ఏర్పాటు చేస్తాం

బేస్తవారిపేట మండలంలో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రేషన్ సరుకుల పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే సమాచారం అందిస్తే పరిష్కరిస్తాం. నూతన ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తాం.

– జితేంద్రకుమార్, తహసీల్దార్, బేస్తవారిపేట

హామీలు అమలు చేశామని చెప్పే ధైర్యం
కూటమి నేతలకు లేదు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలతో కార్యకర్తలకు గౌరవం
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై పార్టీ శ్రేణులకు 'అన్నా' దిశానిర్దేశం
- జగనన్న పోరుబాట విజయవంతం చేసినందుకు అభినందన



చంద్రబాబు మేనిఫెస్టోను చూపుతున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు చేశామని చెప్పుకునే ధైర్యం వారికి లేద'ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు విమర్శించారు. బుధవారం మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తర్లుపాడు మండల నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2024 ఎన్నికల ముందు సూపర్ 6 హామీలతో పాటు 143 హామీలను ప్రజలకు ఇచ్చి అమలు చేయకుండా వంచిస్తున్నారని దుయ్యబట్టారు. కేవలం అధికారం ఉంది కాబట్టి అధికార దర్పం, దౌర్జన్యంతో మాత్రమే వారు కార్యక్రమాలు చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను కార్యకర్తలకు చదివి వినిపించారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ప్రజల మొబైల్‌ఫోన్లకు వచ్చిన మెసేజ్‌లను చదివి వినిపించారు. అలవికాని హామీలిచ్చి రాష్ట్ర అభివృద్ధికి పునరంకితమనే ప్రతిజ్ఞ చేసి ప్రజలను చంద్రబాబు అండ్ కో నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు హామీలకు పవన్‌కల్యాణ్ గ్యారెంటీ ఇచ్చి సంతకం పెట్టారన్నారు. హామీలు అమలు చేయాలని అడుగుతుంటే అక్రమ కేసులు పెడుతూ కుట్రలకు తెరదీస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో ప్రజల్లో కార్యకర్తలకు, నాయకులకు విపరీతమైన గౌరవం, గుర్తింపు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో చంద్రబాబు మోసాలను ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులతోపాటు తానుకూడా ప్రతి గ్రామంలో పాల్గొని చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తానన్నారు. కార్యకర్తల విలువ పెరిగేలా రానున్న రోజుల్లో పార్టీ అధినాయకత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. పొదిలిలో పొగాకు రైతుల కోసం జగనన్న నిర్వహించిన పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు రైతన్నలకు, రైతు కూలీలకు అన్నా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అన్నా రాంబాబు ముందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు అన్నాతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా రాష్ట్ర మైనార్టీ విభాగం నాయకులు పెద్దమస్తాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మైనార్టీలను వేధిస్తోందని మండిపడ్డారు. మండల పార్టీ అధ్యక్షులు మురారి, జిల్లా ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షులు వీరయ్య, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ గ్రామాల పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

అడిగిందొకటి.. చేసిందేంటి?

- సాగర్ పైప్ లైన్ పొడిగించాలని అర్జీ ఇచ్చిన పొదిలి మండలం ఏలూరు వాసి
- మినీ ట్యాంక్‌కు కుళాయి బిగించి సమస్య తీర్చినట్లు అధికారుల తప్పుడు నివేదిక



మినీ ట్యాంక్ వద్ద అర్జీదారుడు కాకుండా మరో వ్యక్తితో అధికారులు తీసుకున్న ఫొటో

పొదిలి రూరల్: సాగరు నీరు సరఫరా చేయాలని పొదిలి మండలం ఏలూరు పంచాయతీ ఎస్సీకాలనీ వాసులు కోరుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఈ క్రమంలో కాలనీకి చెందిన ధర్నాసి శ్రీను ఈ నెల 14వ తేదీన గ్రీవెన్స్‌లో అర్జీ దాఖలు చేశారు. గ్రామంలోని సాగర్ పైప్‌లైన్‌ను పొడిగించి కాలనీకి మంచి నీరు సరఫరా చేయాలనేది అర్జీ సారాంశం. పొదిలి పంచాయతీరాజ్ అధికారుల వద్దకు చేరిన ఈ అర్జీని గ్రామ పంచాయతీ కార్యదర్శికి పంపారు. కనీసం అర్జీదారుడిని విచారించకుండా.. డీప్ బోరు వద్ద మినీ ట్యాంకుకు కుళాయి బిగించి మరో వ్యక్తితో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి కలిసి చక్కగా ఫొటో దిగారు. వారం రోజుల తర్వాత ఈ ఫొటో ఉన్నతాధికారులకు పంపి సమస్య పరిష్కరించామని చేతులు దులుపుకొన్నారు. ఈ విషయమై తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసి అర్జీదారుడు అవాక్కయ్యాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. 'పైప్‌లైన్ పొడిగించాలంటే దాదాపు రూ.4 లక్షలు ఖర్చు అవుతుంది. పంచాయతీలో అంత డబ్బు లేనందున తీర్మానం ఇవ్వలేదు' అని చెప్పారు.

ఘనంగా 'అన్నా'జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముందస్తు జన్మదిన వేడుకలను బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చెంచిరెడ్డి, పీఎల్పీ యాదవ్, కౌన్సిలర్లు సిరాజ్, సలీమ్, కృష్ణ, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న బట్టగిరి తిరుపతిరెడ్డి, నాగరత్నం, కేపీ రెడ్డి, నల్లబోతుల కొండయ్య, విజయలక్ష్మి, మల్లికతోపాటు తర్లుపాడు మండల నాయకులు పాల్గొని అన్నా రాంబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బదరీ నారాయణస్వామిగా చెన్నకేశవుడు



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వారు తిరునక్షత్రం(పుట్టినరోజు) సందర్భంగా బదరీ నారాయణుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సార్థ్యం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

మార్కాపురం టౌన్: ఒంగోలులో ఆగస్టు 7వ తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సారథ్యం పేరుతో నిర్వహించనున్న శోభాయాత్ర, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. బుధవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు ఎస్ శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహన పన్ను చెల్లింపు గడువు నేటితో పూర్తి

- రేపటి నుంచి స్పెషల్ డ్రైవ్.. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి
- విలేకరుల సమావేశంలో ఆర్టీఓ శ్రీ చందన వెల్లడి



మాట్లాడుతున్న ఆర్టీఓ శ్రీ చందన

మార్కాపురం: వివిధ వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్ను చెల్లింపు గడువు గురువారంతో ముగుస్తుందని, ఆగస్టు 1వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పన్ను చెల్లించని వాహనాలను సీజ్ చేసి జరిమానా విధిస్తామని మార్కాపురం ఆర్టీఓ శ్రీ చందన పేర్కొన్నారు. బుధవారం ఆర్టీఓ తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జీపులు, కార్లు, టిప్పర్లు, బస్సులు, ట్రాక్టర్లు, ఇతర గూడ్స్ ప్రైవేట్ వాహనాల యజమానులు ఈ నెల 31లోగా పన్ను చెల్లించాలని స్పష్టం చేశారు. సాధారణంగా జూన్ 30లోగా పన్ను చెల్లించాలని, అయితే ప్రభుత్వం జూలై ఆఖరు వరకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. వినియోగంలో లేని వాహనాల వివరాలు ట్రాన్స్‌పోర్టు వెబ్‌సైట్‌లో నమోదుచేస్తే జరిమానా ఉండదని చెప్పారు. మార్కాపురం డివిజన్‌లో సుమారు 250 స్కూల్ బస్సులు ఉండగా జూలై 12 నాటికి 97 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నాయని, మిగిలిన బస్సులను తామే తనిఖీ చేసి ఫిట్‌నెస్ ఇచ్చామన్నారు. ఇంకా డివిజన్ వ్యాప్తంగా 30 స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉందని, వాటిని వాడకపోతే సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్కూళ్లు, కళాశాలలు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. పోలీసులతో కలిసి తమ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. మార్కాపురం ఆర్టీఓ కార్యాలయం ద్వారా 94 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, వాహనాల యజమానులకు, డ్రైవర్లకు సేవలు, సమాచారం కావాల్సి వస్తే నేరుగా తమను సంప్రదించాలని, ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదన్నారు. సమావేశంలో ఎంవీఐ మాధవరావు పాల్గొన్నారు.

సకాలంలో ప్లాంటేషన్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీఓ గురువరకుమార్

బేస్తవారిపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన పండ్ల తోటలను సకాలంలో నాటించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట మండలంలో 118 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి అనుమతులు వచ్చాయన్నారు. వారం రోజుల్లో మొక్కలు నాటించడం పూర్తి చేయాలని సూచించారు. ఫారం పాండ్స్ ఏర్పాటుకు కొత్తవాటిని గుర్తించాలని తెలిపారు. వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో, ప్రభుత్వ భూముల్లో చేపల పెంపకానికి ఫిష్ పాండ్స్ నిర్మించనున్నట్లు చెప్పారు. పని కావాలని అడిగిన ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేయించాలన్నారు. సమావేశంలో ఈసీ నాగేశ్వరరావు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సాగర్ నీరు నేలపాలు



నాగంపల్లి ఎస్సీ కాలనీ పాఠశాల వద్ద వృథాగా పోతున్న నీరు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీ మండల ప్రాథమిక పాఠశాల(ఏపీ) వద్ద, బ్రాహ్మణపల్లి సమీపంలోని పొలాల్లో సాగర్ పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడటంతో తాగు నీరు వృథాగా పోతోంది. దీంతో కుళాయిలకు సక్రమంగా నీరు రావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించాలని, అలాగే పలుచోట్ల కుళాయిలు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.